ఇసుక... మంచి కాలమే ఇక!

- సీఎం నిర్ణయంతో హర్షాతిరేకాలు
- గ్రామగ్రామాన ప్రశంసల వెల్లువ
- అక్రమార్కుల నోట్లో వెలక్కాయ

–ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రామాపురం

ఇసుక ఉచితంగా దొరుకుతున్న రోజులవి. సమీప వాగులు, వంకలు, నదుల నుంచి అవసరానికి తెచ్చుకుని వాడుకుంటున్న పరిస్థితి. ఎలాంటి షరతుల్లేకుండా నాణ్యమైన ఇసుకను తెచ్చుకునే పరిస్థితిని వైకాపా అధికారంలోకి వచ్చాక కష్టకాలంలోకి నెట్టేసింది. ఇసుకను బంగారంగా మార్చేసింది. పంట పొలాల పక్కనున్న ఇసుకను సైతం ముట్టుకునే పరిస్థితి లేకుండా చేసేసింది. మన దగ్గరే ఇసుక ఉన్నా కొనుక్కోవాల్సిన దుస్థితిలోకి తీసుకెళ్లింది. ఈ వ్యవహారంలో గత అయిదేళ్లుగా ఎన్నో అరాచకాలు చోటుచేసుకున్నాయి. నేరాలు.. ఘోరాలు జరిగాయి. పాత రోజులను నెమరు వేసుకోవడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో ఇసుకే వైకాపా ప్రభుత్వ పునాదులను పెకలించింది. ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చినా అక్కడక్కడా లోపాలు.. అక్రమాలు దొర్లాయి. దీనిపైనా పెదవి విరుస్తున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాజాగా తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు సంబర పడుతున్నారు. మరోవైపు కూలీలకు ఉపాధి దొరుకుతోంది.

● రేవుల నుంచి సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగానే ట్రాక్టర్లతో తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఎన్డీయే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉచిత ఇసుకపై సవరణ నిర్ణయాన్ని ఇటీవల జరిగిన తెదేపా ప్రజా ప్రతినిధుల భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించి వెంటనే ఆచరణలోకి తీసుకొచ్చారు. దీంతో గత మూడు రోజులుగా అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో నెలకొన్న పరిస్థితుల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. తాజా నిర్ణయాలతో అక్రమార్కులు నోట్లో వెలక్కాయ పడినట్లయింది. ఉచిత ఇసుక విధానం వచ్చాక సైతం కొన్ని ప్రాంతాల్లో నేతలు తమ గుప్పిట్లో రేవుల్ని పెట్టుకుని టిప్పర్ల వంతున వసూళ్లకు పాల్పడ్డారు. వాహనాలకు ఇసుక నింపడంలోనూ పైరవీలు జరిగాయి. పేరుకే ఉచిత ఇసుక అంటున్నారని, వసూళ్లకు పాల్పడుతున్నారంటూ విమర్శలు వినిపించాయి. ఈ తరుణంలో బేషరతుగా రేవుల్లో నుంచి ఉచితంగా తీసుకెళ్లే విధానాన్ని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చి ఆచరణలో పెట్టింది. దీంతో రెండు జిల్లాల్లోనూ ఇసుక పరంగా ఎలాంటి అక్రమాల్లేకుండా పోయాయి. వినియోగదారులు వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుక తీసుకెళుతున్నారు. ప్రత్యేకించి ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలు ఎలాంటి షరతుల్లేకుండా ఇసుకను వినియోగించుకుంటున్నారు. కూలీలు సైతం ఇసుక నింపడానికి వెళ్తూ ఉపాధి పొందుతున్నామనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అధిక లోడు పేరిట జరిమానాలు విధించడానికి చెల్లుచీటి పలికారు.

చాలా ఉపశమనం

ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో ఇసుక ట్రాక్టర్ల యజమానులు, వినియోగదారులు ఉపశమనం పొందారు. వాగుల పేరిట వాహనాలను పట్టుకోవడం, అక్రమ మామూళ్ల పాల్పడడం జరిగింది. వీటన్నింటికీ మంగళం పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం, ఆచరణలో పెట్టడం జరిగిపోయింది.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల అవశ్యం

ఇరు జిల్లాల నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు ఇసుక తరలిపోకుండా సరిహద్దుల్లో పటిష్టంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్ని రకాలుగా ఉచిత అనుమతుల ముసుగులో పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా ప్రత్యేకంగా తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి ఇసుక నాణ్యంగా ఉండడంతో పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంటోంది. జిల్లా వినియోగదారులకు తప్ప ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.



రామాపురం మండలం ముద్దిరేవుల వంక నుంచి ఇసుక తీసుకెళ్తున్న గృహ నిర్మాణ లబ్ధిదారులు

అక్రమాలు జరిగితే సహించం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పోలీసు, రెవెన్యూశాఖలు గౌరవించాలి. ఏదైనా అక్రమాలు జరిగిన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం. వంకలు, వాగులు, నదుల నుంచి ఇసుక తీసుకెళ్తే పట్టించుకోవద్దు. అడ్డంకులు సృష్టించే అధికారులపై చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరెడ్డి, తెదేపా పాలిట్‌బ్యూరో సభ్యుడు

గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డాం



వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో ఉచితంగా ఇసుకను తీసుకెళుతున్నాం. కుటుంబ సభ్యులమే ట్రాక్టర్‌కు నింపుకొని తరలించుకుంటున్నాం.

-తులసమ్మ, లక్కిరెడ్డిపల్లె

వేధింపులు అధికంగా ఉండేవి



ఇసుక విషయంలో గతంలో అధికారుల నుంచి వేధింపులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం ఎవరూ అడగడంలేదు. వంక నుంచి ఉచితంగా ఇంటికి తీసుకెళుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రుణపడి ఉంటాం.

-వెంకటరమణ, చిట్లూరు, రామాపురం మండలం

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం!

- బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మృత్యుఒడికి
- కలకడ సమీపంలో ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో




ఘటనా స్థలంలో మృతదేహాలు



తీవ్రంగా గాయపడిన తల్లీకుమార్తెలు దిల్‌షాద్, తారా

కలకడ, న్యూస్‌టుడే: బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి ఆటోలో ఇంటికొస్తుండగా వారిని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని కలకడ సమీపంలో సోమవారం రాత్రి ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంబేపల్లె మండలం రౌతుకుంట వంగిమళ్లవాండ్లపల్లెలో పీరాంబీ అనే మహిళ మృతిచెందారు. ఈమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కలికిరి మండలం చంద్రావారిపల్లె పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన ఆమె బంధువులు సోమవారం ఆటోలో బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం అనంతరం ఇంటికి తిరిగొస్తుండగా కలకడ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వేగంగా వస్తూ బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఫకీర్‌బీ (55), బుజ్జమ్మ (50), ఖాదర్‌వలీ (35), చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమందకు చెందిన ఆటో డ్రైవరు నూరుల్లా (36) దుర్మరణంపాలయ్యారు. యాసానుల్లా (45), తల్లీకుమార్తెలు దిల్‌షాద్ (25), తారా(4) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, కలకడ సీఐ గంగాధర్, ఎస్.ఐ. రామాంజనేయులు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను '108'లో పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలసోయగం!



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట మరింత శోభను సంతరించుకుంది. గండికోట చుట్టూ ఉన్న పచ్చని కొండల నుంచి తెల్లటి నురుగుతో పాలధార వలే జలాలు కిందకు దూకుతుండడం పర్యాటకులను కనువిందు చేస్తోంది. మైలవరం జలాశయంలోకి నిండుగా నీరు చేరడంతో రెండు కొండల నడుమ పెన్నాలోయకు మరింత అందం చేకూరింది. జలపాత సోయగాలు కనువిందు చేస్తుండడంతో పలువురు చరవాణిలో దృశ్యాలను బంధిస్తూ ఆహ్లాదకరంగా గడుపుతున్నారు.

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

గండికోట లోగో, ట్యాగ్‌లైన్ అధికారిక ప్రకటన

GANDIKOTA
The Grand Canyon of India

ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట వారసత్వం, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ సోమవారం అధికారికంగా ప్రకటించినట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లోగా డిజైన్ పోటీల్లో గెలుపొందిన తుషార్ శివాంకర్‌ను అభినందించినట్లు తెలిపారు. విజేత మహారాష్ట్రకు చెందిన వ్యక్తి అని, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ అని, లోగో అవార్డు ప్రైజ్‌మనీ రూ.25 వేలు త్వరలో అందజేస్తామన్నారు. ఈ ప్రయత్నం గండికోటలో పర్యాటక రంగాన్ని పెంచడం కోసమేనని తెలిపారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఎన్నాళ్లో వేచిన ఉదయం



- తీరనున్న నిరుద్యోగుల ఆకాంక్ష
- 3న డీఎస్సీ నోటిఫికేషన్‌కి ప్రభుత్వ కసరత్తు

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎన్డీయే ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. నిరుద్యోగుల కలలను సాకారం చేసేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 3వ తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం టెట్ కొనసాగుతుండగా, వచ్చే నెల 2వ తేదీకి వాటి ఫలితాలు విడుదల చేసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తోంది. మొత్తంగా నవంబరు 3న షెడ్యూలు విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

–న్యూస్‌టుడే, కడప విద్య

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎన్డీయే ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించేందుకు జూన్ 23వ తేదీన ఆమోదించింది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 50 వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ ప్రకటన కోసం వేయికళ్లతో వేచిచూస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన తొలి అయిదు సంతకాల్లో మెగా డీఎస్సీ ఉండడం, పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండటంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలు శిక్షణ కేంద్రాల్లో నిరుద్యోగులు తర్ఫీదు పొందుతూ సన్నద్ధమవుతున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ నిర్వహించగా, తిరిగి తెదేపా భాగస్వామ్య ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ ప్రకటన వెలువడనుంది.

● ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన గత వైకాపా ప్రభుత్వ మాటలు నీటిమూటలయ్యాయి. వివిధ జీవోల అమలు పేరుతో ఉన్న పోస్టులను సైతం రద్దు చేసింది. నిరుద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీఎస్సీ అంటూ నాటకానికి తెరలేపి హడావుడిగా 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పరీక్ష వాయిదా పడింది. మొత్తంగా గత ప్రభుత్వంలో ఒక్క పోస్టూ భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల ఆగ్రహానికి వైకాపా ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టెట్ నిర్వహణ, ఫలితాల విడుదల, డీఎస్సీ నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల వంటి విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుతుండటంతో నిరుద్యోగులందరూ ఆశగా షెడ్యూలు కోసం ఎదురుచూస్తున్నారు. నవంబరు 3వ తేదీన డీఎస్సీ నోటిఫికేషన్, షెడ్యూలు విడుదలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంపై నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



కడప నగరంలోని ఓ శిక్షణ కేంద్రంలో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న యువత

ఖాళీ పోస్టుల వివరాలివి...

ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా ఎస్ఏ (1 లాంగ్వేజ్) 21, ఎస్ఏ (2 లాంగ్వేజ్) 10, ఆంగ్లం 36, గణితం 32, ఫిజికల్ సైన్స్ 19, బయాలజీ 19, సాంఘికశాస్త్రం 17, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీఈటీ) 73, ఎస్జీటీ 297 మొత్తంగా 524 స్పష్టమైన ఖాళీలుగా ఉన్నాయి. 2024, జనవరి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఎస్ఏ (1 లాంగ్వేజ్) 3, ఎస్ఏ (2 లాంగ్వేజ్) 4, ఆంగ్లం 18, గణితం 3, పీఎస్ 6, బీఎస్ 12, ఎస్ఎస్ 14, పీఈ 4 పోస్టులు కలిపి మొత్తం 64 పోస్టులు ఖాళీలయ్యాయి. మొత్తంగా ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా 588 ఖాళీలున్నాయని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకం

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రారంభం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలోని పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకమని, వారి సేవలు వెలకట్టలేమని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టరు అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులతో కలిసి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రారంభించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. దేశంలో గతేడాది అక్టోబరు 21 నుంచి ఈ ఏడాది అక్టోబరు 20 వరకు వీరమరణం పొందిన పోలీసుల పేర్లను చదివి వినిపించారు. పోలీసు అమరవీరుల స్తూపంపై పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటించారు. జిల్లాలో వివిధ కారణాలతో మృతిచెందిన పోలీసుల కుటుంబ సభ్యులను సన్మానించి, జ్ఞాపిక, చెక్కులు అందజేశారు. మృతి చెందిన ఓ కానిస్టేబుల్ భార్య తన భర్త చిత్రపటాన్ని చూసి విలపించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రాణ త్యాగం చేసిన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టరు అదితిసింగ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పాలన వ్యవస్థలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలను ఆదుకుంటామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శన, ఛాయా చిత్ర ప్రదర్శనను న్యాయమూర్తి ప్రారంభించి తిలకించారు. ఓపెన్ హౌస్‌లో పోలీసులు ప్రదర్శించిన ఆయుధాలను పరిశీలించారు. అనంతరం జాగిలాల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అమరువీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్



తన భర్త చిత్రపటాన్ని చూసి కన్నీరు పెట్టుకున్న మహిళ, పక్కన జిల్లా అధికారులు

నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం

- బాధితులకు తెదేపా నేతల అభయం
- పలువురు ఆర్థిక సాయం అందజేత

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణంలో హత్యకు గురైన ఇంటర్మీడియట్ విద్యార్థిని కేసును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని సోమవారం వారు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. నిందితుడికి కఠిన శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ స్కూల్‌లో మీ కుమారుడిని చేర్పించి చదివిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఎన్నో ఘోరాలు, నేరాలు జరిగినప్పుడు మాజీ సీఎం జగన్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గతంలో జరిగిన నేరాలకు కేసులు సైతం నమోదు చేయలేదని, తిరిగి బాధితులపైనే ఎదురు కేసులు పెట్టారని, అటువంటి వ్యక్తికి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి శ్రీనివాసరెడ్డి, రితీష్‌రెడ్డి, చెరుకూరి రవికుమార్‌లు వేర్వేరుగా రూ.లక్ష వంతున ఆర్థికసాయం అందజేశారు.



ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న తెదేపా నేత రితీష్‌రెడ్డి, నాయకులు



బాధిత కుటుంబాన్ని పరామర్శించి వస్తున్న తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, నాయకులు

జలవనరులశాఖ సీఈగా శ్రీనివాసులు



కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జలవనరులశాఖ సీఈగా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న ఆయనకు అడహక్ ప్రమోషన్‌తో అదేరోజు సీఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ సీఈగా ఉన్న మల్లికార్జునరెడ్డిని తిరుపతి జిల్లా సీఈగా నియమించారు.

ఏపీఎంఐపీ పీడీగా వెంకటేశ్వరరెడ్డి : ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకం (ఏపీఎంఐపీ) పీడీగా వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను డిప్యుటేషన్‌పై వైఎస్సార్ జిల్లా పీడీగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన ఉమ్మడి కడప జిల్లాలో ఉద్యానశాఖ ఏడీగా పనిచేశారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న రవీంద్రనాథ్ రెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ పొందగా, ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి పీడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన చీనీ ధరలు

లింగాల, న్యూస్‌టుడే : చీనీ ధరల స్వల్ప పెరుగుదలతో అన్నదాతలకు ఊరటనిస్తోంది. దసరా సమయంలో టన్ను ధర రూ.45 వేల నుంచి రూ.50 వేలకు మించి పలకలేదు. గత మూడు రోజులుగా టన్ను ధర రూ.65 వేలు పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రండి... ఆధార్ నవీకరించుకోండి!

- మార్పులు, చేర్పులకు మరో అవకాశం
- నేటి నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు

–న్యూస్‌టుడే, కడప

ఆధార్... భారత విశిష్ట ప్రాధికార సంస్థ జారీ చేసిన గుర్తింపు సంఖ్య. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. మరోవైపు తప్పిదాలు ఉండడంతో అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సాంకేతిక లోపాలతో వేలిముద్రలు సక్రమంగా సరిపోలడం లేదు. ఫలితంగా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను అధిగమించాలని ప్రభుత్వం ముందుకొచ్చింది. నేటి (మంగళవారం) నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. మార్పులు, చేర్పులకు మరో అవకాశం కల్పించారు.

● వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో గ్రామ సచివాలయాలు 846, వార్డు విభాగంలో 300 ఉన్నాయి. వీటి పరిధిలో 5-15 ఏళ్లలోపు 1,30,346 మంది, 15-17 ఏళ్లలోపు 2,05,940 మంది, 18 ఏళ్లు నిండిన వారు 3,36,286 మంది ఆధార్ కార్డుల్లో వేలిముద్రలు నవీకరించుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లాల వారీగా సమాచారం పంపించారు. నాలుగు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చారు. ఎంపీడీవోలు, పురపాలక, నగరపాలక కమిషనర్లు క్షేత్రస్థాయిలో అమలు తీరుపై పర్యవేక్షణ చేయాలని ఉత్తర్వులిచ్చారు



ఒంటిమిట్ట గ్రామ సచివాలయంలో వేలిముద్రలు నవీకరించుకుంటున్న విద్యార్థిని

సేవా రుసుంలు ఇలా...

ఆధార్ కేంద్రాల్లో నవీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పిల్లలకు సంబంధించి బాలఆధార్, కొత్త ఆధార్ నమోదుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదు. 5-7, 15-17 ఏళ్ల మధ్య బాలబాలికల బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి సేవలు ఉచితంగా పొందవచ్చు. ఇక 7, 17 సంవత్సరాలు నిండినవారు వేలిముద్రల నవీకరణకు రూ.100 వసూలు చేస్తారు. ఆధార్‌తో చర వాణి లింక్, ఈ-మెయిల్ లింక్, డాక్యుమెంట్లు అప్‌డేట్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మార్పు చేసుకోవడానికి రూ.50 చొప్పున చెల్లించాలి. చిత్రం+బయోమెట్రిక్+ఐరిష్ మార్పునకు రూ.100 వసూలు చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. పనిచేస్తున్న సచివాలయంలో కాకుండా మరో ప్రాంతంలో శిబిరం ఏర్పాటుకు అవసరమైన యంత్ర సామగ్రి తరలించడానికి రూ.500, శిబిరం నిర్వహణకు రూ.వెయ్యి చొప్పున కేటాయించారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేటి (మంగళవారం) నుంచి 25వ తేదీ వరకు ఆధార్ నమోదు, నవీకరణ చేసుకోవడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించాం. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ పత్రాలు తీసుకురావాలి. మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ఎలాంటి తప్పిదాలు జరగకుండా క్షేత్రస్థాయిలో అమలు తీరుపై పర్యవేక్షణ చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ప్రత్యేకాధికారి, గ్రామ, వార్డు సచివాలయాలు, కడప

రైతేరాజు 6లో

రైతేరాజు

పశువుల్లో గొంతువాపు వ్యాధిని కట్టడి చేద్దామిలా

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రమాదకరమైనది. కళ్ల నుంచి నీరు, ముక్కు ద్వారా స్రావం కారుతుంది. పశువులకు శ్వాస తీసుకోవడం కష్టమవుతోంది. ఊపిరితిత్తులు, శ్వాస వాహికల్లో పుండ్లు ఏర్పడి చీము చేరుతుంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పీలుస్తుంది. గుర్రు గుర్రుమని శబ్దం వస్తుంది. శ్వాస కష్టమై నాలుక బయటికి వస్తుంది. సల్ఫాడిమిడిన్ 30 మి.లీ. మందును 3 రోజుల పాటు రక్తంలోకి ఎక్కించాలి. చర్మం కింద కండకు కూడా మందును ఆయుడు రోజుల పశువు కండకు ఇవ్వాలి. వాపు తగ్గడానికి కార్టిజోన్, జోలిడ్ మందులను 10 నుంచి 15 మి.లీ మోతాదులో మూడు రోజులు కండకు ఇవ్వాలి. వ్యాధి ప్రబలిన పశువులను కొనుగోలు చేయరాదు. జబ్బు ప్రబలకుండా పశువులకు ముందస్తుగా గొంతు వాపు టీకాలను ఆయుడు నెలల వయసు పైబడిన దూడలతో సహా అన్ని పశువులకు 3-5 మి.లీ టీకాను మోతాదులో చర్మం కింద వేయించాలి. వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను మంద, పాకల నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను ఫినాయిల్‌తో శుభ్రం చేయాలి. చనిపోయిన పశువులను గ్రామానికి దూరంగా లోతైన గుంత తవ్వి పొడి సున్నం చల్లి పూడ్చిపెట్టాలి. పశువులకు అందించే దాణాల్లో ఆక్సిటెట్రాసైక్లిన్ పొడి మందులను కలిపి ఇవ్వాలి. ఒక ప్రాంతం నుంచి మరో చోటుకు రవాణా చేసేటప్పుడు మధ్యలో కాస్త విశ్రాంతి ఇవ్వాలి.

- డాక్టర్ జి.రాంబాబు, పశువైద్యాధికారి, కడప

చిట్కా



ఉల్లి పంటను పరిశీలిస్తున్న వనిపెంట కేవీకే అధిపతి ఎం.బాలకృష్ణ

- న్యూస్‌టుడే, మైదుకూరు

తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలపై ప్రభావం చూపనుంది. ఉద్యాన పంటల్లో ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి ఎం. బాలకృష్ణ తెలిపారు. పసుపు, మిరప, ఉల్లి, అరటితో పాటు కూరగాయ పంటల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేక 13:0:45 లేక యూరియాలవి పోషకాలను పంటపై పిచికారీ చేయాలని సూచించారు.

వర్షాకాలం... అప్రమత్తమైతే ప్రయోజనం

పసుపు : పొలంలో నీరు నిల్వ లేకుండా చేయాలి. 2 శాతం యూరియా లేక 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం రోజుల్లో 2 సార్లు పిచికారీ చేయాలి. ప్రొపికొనజోల్ 0.1 శాతం, డైఫెన్కొనజోల్ 0.1 శాతం ద్రావణాలను వారం వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయడంతో ఆకు మచ్చ, తాటాకు మచ్చ తెగులు నివారించవచ్చు. 0.3 శాతం కాపర్ ఆక్సిక్లోరైడ్ లేక బోర్డో మిశ్రమం నేలను తడపడం ద్వారా దుంపకుళ్లు నివారించవచ్చు.

మిరప : పురుగు, తెగుళ్లు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. సూక్ష్మధాతు లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఒడలిపోయిన మొక్కకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు తేరుకున్న తరువాత పోషకాల మిశ్రమం లీటరు నీటికి 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కానోపోరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. దీని నుంచి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మరియు 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణం పిచికారీ చేయాలి.

ఉల్లి : ఆకుమచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేక క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అరటి : ఐదారు నెలల వయసు ఉండి గెలలు వేసే దశలో ఉన్న పంట 5 రోజుల కంటే తక్కువగా ముంపునకు గురైతే వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది. బ్యాక్టీరియా దుంపకుళ్లు సోకే అవకాశం ఉంది. ఆకులు తడిచేలా 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి తీసుకుని జిగురు కలిపి వారం రోజుల్లో మూడుసార్లు పిచికారీ చేయాలి. సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు 1 మి.లీ ప్రొపికొనజోల్ లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారీ చేయాలి. దుంప కుళ్లు పోకుండా లీటరు నీటికి 3 గ్రాముల లేక ఒకశాతం బోర్డో మిశ్రమం దుంపచుట్టూ తడిచేలా పోయాలి. దుంపకుళ్లు సోకిన మొక్కలను గమనించి లీటరు నీటికి 25 గ్రాముల బ్లీచింగ్ పొడి కలిపి మొదలు తడిచేలా పోయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తరువాత మరోసారి పోయాలి.


ప్రశ్న : రబీ సీజన్‌లో మినుము సాగులో విత్తనశుద్ధికి ఏ రకం మందులు పిచికారీ చేయాలి. పురుగుల ఉధృతి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - ఎన్.సుబ్బరామిరెడ్డి, రైతు, రాజుపాలెం

సమాధానం : మినుముల కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ+మాంకోజెబ్ 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేస్తే రసం పీల్చే పురుగుల బారి నుంచి లేత పైరును కాపాడుకోవచ్చు. అదే విధంగా తొలి దశలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా కట్టడి చేయవచ్చు. ఎకరా విస్తీర్ణం పొలంలో పసుపు, నీలి వర్ణం జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే పచ్చదోమ, తామర పురుగుల ఉనికిని, ఉధృతిని గమనించవచ్చు. వైరస్ తెగులు సోకకుండా 4-6 వరుసలో జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను వేసుకుంటే మంచిది.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

- డాక్టర్ వి.మాధురి, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఊటుకూరు

అలసంద సాగు... ప్రత్యామ్నాయంగా బాగు



సాగైన పంట

తుపాను ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలు ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉన్నట్లు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్తలు కె. మాధురి, వై.పీరు సాహెబ్ తెలిపారు. ఈ తరుణంలో అలసందను ప్రత్యామ్నాయ పంటగా సాగుచేస్తే రైతులకు లాభసాటిగా ఉండటమే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం కూడా పొందవచ్చని సూచించారు.

● **అలసంద రకం:** టీపీటీసీ-20 రకం. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద కిలో రూ. 180కి లభిస్తుంది. రబీలో నీటి పారుదల కింద ఈ నెల నుంచి నవంబరు వరకు విత్తుకోవచ్చు. 85 నుంచి 90 రోజుల పంటకాలం. దిగుబడి ఎకరాకు 6 క్వింటాళ్లు వస్తుంది.

● **ఎరువులు :** చివరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరాకు 2 కిలోల పాస్ఫో బ్యాక్టీరియా 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి దుక్కిలో గాని విత్తనం విత్తేటప్పుడు గాని సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. ఈ ఎరువు భూమిలోని మొక్కలకు లభ్యం కాని రూపంలో ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందిస్తుంది.

- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

మా మొర ఆలకించండయ్యా..!



వినతులు స్వీకరిస్తున్న బాధ్య కలెక్టర్ అదితిసింగ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలంటూ బాధితులు అధికారులను వేడుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదని ఉన్నతాధికారులైనా స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలువురు అర్జీదారులు బాధ్య కలెక్టర్ అదితిసింగ్‌కు తమ గోడు విన్నవించుకున్నారు. ● ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దని బాధ్య కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి ఆయాశాఖలకు బదలాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేసేలా చూడాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, తదితరులు వినతులు స్వీకరించారు.



శ్మశానవాటికకు స్థలం కేటాయించడం లేదు : లింగంపల్లెలో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కొన్నేళ్లుగా సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. గత వైకాపా పాలనలో అయిదేళ్ల పాటు అర్జీలు ఇచ్చి విసుగు చెందాం. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. కలెక్టర్లు మారినా మా గోడు ఎవరికీ పట్టడం లేదు.

- లక్షుమయ్య, లింగంపల్లె, సిద్దవటం మండలం



పొలం ఆక్రమించుకున్నారు ; కష్టపడి సంపాదించుకున్న అయిదెకరాల భూమిని ఆక్రమించుకున్నారు. కోర్టు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదు. న్యాయం చేయమని అడుగుతుంటే దాడి చేస్తున్నారు. భూమి ఎవరి పేరు మీద ఉందో విచారణ చేపట్టాలి. పోలీసుస్టేషన్‌కు వెళ్లినా పట్టించుకోవడంలేదు. ఈ వయసులో ఆక్రమణదారులతో పోరాడలేకున్నాం.

- వెంకటలక్షుమ్మ, పెద్దపసుపుల, పెద్దముడియం



పింఛను ఇవ్వడంలేదు ; ఇంటి వివాదం కోర్టులో నడుస్తోందని అర్హత కలిగిన తనకు పింఛను ఇవ్వడం లేదు. ఇంటికి, నా పింఛనుకు సంబంధం ఏంటో తెలియడం లేదు. ప్రస్తుతం నాకు పక్షవాతం వచ్చింది. నాకు పింఛను ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకోవాలని అంటున్నారు. కేసుకు, నా పింఛనుకు సంబంధం ఉందా. ఉన్నతాధికారులు న్యాయం చేసి పింఛను మంజూరు చేయించాలి.

- ఓబులమ్మ, కొంగలవీడు, బద్వేలు మండలం

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



మాదన విజయకుమార్



పాలెం మహేష్‌బాబు

కడప విద్య, న్యూస్‌టుడే : నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన స్వర్ణోత్సవాల జిల్లా మహాసభలలో యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి, అధ్యక్షుడిగా మాదన విజయకుమార్, సహాధ్యక్షులుగా రవికుమార్, సుజాతరాణి, ప్రధాన కార్యదర్శిగా పాలెంమహేష్‌బాబు, కోశాధికారిగా నరసింహారావు, కార్యదర్శులుగా చెరుకూరి శ్రీనివాసులు, రవీంద్రుడు, చెన్నయ్య, రమణ, ఏజాస్‌అహ్మద్, మురళీకృష్ణ, చంద్ర ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, శివప్రసాద్, ఈరిబాలజోజి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెంమహేష్‌బాబు, మాదన విజయకుమార్, రూతుఆరోగ్యమేరీ, ఓబుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ప్రభాకర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా దేవదత్తం, రమణ, రవిశంకర్, ఫయాజుద్దీన్, మేరి ప్రసన్న ఎన్నికయ్యారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు ఎన్నికల అధికారిగా, మరో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పరిశీలకుడిగా వ్యవహరించారు.

జమ్మలమడుగు, వేములలో ఉద్యోగ మేళాలు నేడు

జిల్లా సచివాలయం, వేముల, న్యూస్‌టుడే : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం జమ్మలమడుగు, వేములలో ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాయన్నారు. జమ్మలమడుగు న్యాక్ కేంద్రం, వేములలోని ప్రభుత్వ ఐటీఐలో మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగులు దరఖాస్తుతో ఆయా కేంద్రాల్లో హాజరుకావాలని కోరారు.

ఉపకార వేతనాల పునరుద్ధరణకు దరఖాస్తులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల పునరుద్ధరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు సరస్వతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులు కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి సంబంధిత కళాశాలల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి సంక్షేమశాఖ ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులు పంపాలన్నారు. కళాశాలలలో చదువుతున్న ఎస్సీ విద్యార్థులంతా సమీపంలోని తపాలా కార్యాలయంలో ఐపీపీబీ ఖాతా తెరవాలని సూచించారు.

వాయుసేనలో ఉద్యోగాలపై అవగాహన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని నిరుద్యోగులు, విద్యార్థులు వాయుసేన ఉద్యోగాలపై అవగాహన పెంచుకోవాలని బాధ్య కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో వాయుసేన అధికారులు బాధ్య కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఇండియన్ ఎయిర్‌ఫోర్సు కిట్లు, గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికి సేవ చేయడం ప్రతి విద్యార్థి వరంగా భావించాలన్నారు. వాయుసేనలో ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. ఈ సందర్భంగా నాన్‌కమిషన్డ్ అధికారులు సందీప్, సురేంద్రసింగ్ పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, ఎన్‌వైకే అధికారి శ్రీమణికంఠ, స్టెప్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఈఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : రిజర్వేషన్ వర్గాలకు చెందిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా నూతన రిజర్వేషన్ ఎంప్లాయిస్ సమాఖ్య సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కడప ఆర్ఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పి.హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఓబులేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఓబులేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చైతన్యకుమార్, పులివెందుల తాలూకా అధ్యక్షుడిగా పి.శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ రామచంద్ర, ఎండీ నాగభూషణం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల రిజర్వేషన్ సమస్యలు, అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : పొలతల కొండపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఇసుకపల్లె పంచాయతీ కొత్తపేటకు చెందిన మిథున్ చక్రవర్తి రెడ్డి (30), మరొకరితో కలిసి ద్విచక్రవాహనంపై పొలతలకు వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా కొండపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డారు. వెనుక వస్తున్న ట్రాక్టర్ టైరు అతడి తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెనక కూర్చున్న మరో వ్యక్తి గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పోలీసుల అదుపులో స్మగ్లర్లు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకేదిన్నె మండల పరిధిలోని మద్దిమడుగు అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్సు పోలీసులు 11 ఎర్రచందనం దుంగలతో పాటు ఓ కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆర్ఎస్.ఐ సురేష్‌బాబు బృందం సీకేదిన్నె మండలంలోని మద్దిమడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. కారులో కొంతమంది ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండగా పోలీసులు ముట్టడించారు. వారిలో ముగ్గురిని పట్టుకోగా మిగిలిన వారు పరారయ్యారు. నిందితులను తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నారు.

మనస్తాపంతో బేల్దారి ఆత్మహత్య

కడప, నేరవార్తలు : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కడప ఎర్రముక్కపల్లెకు చెందిన నంద్యాల కృష్ణ (62) బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో దుండగులు

కడప, నేరవార్తలు : తెదేపా కడప నగరాధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడికి పాల్పడిన దుండగుల్లో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరొకరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాడి వెనుక విచారణ చేపట్టారు. అక్కాయపల్లెకు చెందిన ఓ యువకుడు దాడికి పాల్పడినట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారిస్తున్నారు. నిందితులు నాలుగైదు రోజుల కిందట నుంచే రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. ఉదయం 6 గంటలకే దాడి చేయాలని యత్నించారు. కానీ ఆ సమయంలో ఆయన అందరితో కలిసి టీ తాగుతున్నారు. టీ తాగి ఒంటరిగా వాహనంలో వస్తుండగా అడ్డుకుని కర్రలతో చితకబాదారు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం తగలడంతో పాటు వీపుపై వాతలు పడ్డాయి. పోలీసులు ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. దాడి చేసిన వారిలో రౌడీషీటర్ ఉన్నట్లు తెలుస్తోంది.

అశ్రునయనాల మధ్య వీరజవానుకు వీడ్కోలు



ఆర్మీజవానుకు సైనిక లాంఛనాలతో నిర్వహిస్తున్న అంత్యక్రియలు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలిన ఘటనలో మృతిచెందిన బ్రహ్మంగారిమఠం మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన కొడవటికంటి రాజేష్‌కు సోమవారం అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు. ఆయన స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భార్య స్వాతి, తల్లిదండ్రులు బాలమ్మ, బాలయ్య, బంధువుల రోదనలు చుట్టుపక్కలవారిని కంటతడి పెట్టించాయి. ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. గొప్ప జవానును కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి తీరని లోటని కమాండర్ సింగ్ పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలు, వృద్ధులైన అత్తమామలు ఉన్న రాజేష్ భార్య స్వాతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎంపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు.

విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఈ నెల 19న పెట్రోలు పోసి హత్య చేసిన కేసులో నిందితుడు విఘ్నేష్‌ను బద్వేలు గ్రామీణ పోలీసులు సోమవారం స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం కడప కేంద్ర కారాగారానికి 14 రోజులపాటు రిమాండుకు తరలించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ సంచాలకులు సరస్వతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం టెట్ అర్హత కలిగి సంవత్సర ఆదాయం రూ. 2.50 లక్షల లోపు ఉన్న వారు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన వారికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతిభ ఆధారంగా ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప, నేరవార్తలు : బాధితుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక నుంచి సంబంధిత ఠాణాలకు బదలాయించే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో చోరీలు జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు.

పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్

కడప విద్య : పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా సీకేదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వీ కృష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శిగా బుగ్గలేటిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి ఎన్నికయ్యారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టాకృష్ణయ్య, గిరిప్రసాద్, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగిందని జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి తెలిపారు. పీఆర్టీయూ నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామమూర్తి, శ్రీనివాసులు, నరసింహులు, ఆంజనేయులు, బాబురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ద్రాక్షం శ్రీనివాసులు, లక్ష్మీకాంత్, అజీం, కరమతుల్లా, పుల్లయ్యయాదవ్, హరనాథ్‌బాబు తదితరులు వీరికి అభినందనలు తెలియజేశారు.

అంధుల ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు సన్నాహాలు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహించనున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబెనెజర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీకి 75ఏళ్లు పూర్తయ్యే సందర్భంగా రెండు రోజుల పాటు వేడుకలు జరుపుతున్నట్లు తెలిపారు. పాఠశాల పూర్వపు విద్యార్థులు, విధులు నిర్వర్తించిన పూర్వ బోధన, బోధనేతర సిబ్బంది, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలు, శ్రేయోభిలాషులు వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు

కడప క్రీడలు : జిల్లా రోల్‌స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం, డీఎస్ఏ స్కేటింగ్ రింక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపికలు శనివారం ఉత్సాహంగా సాగాయి. వైవీయూ క్రీడా కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డిపోటీలను ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు : ఇన్‌లైన్ విభాగంలో కావ్యకీర్తిరెడ్డి, లోహన్ ఆయాంక్‌రెడ్డి, రిషి, రేయాన్ష్, మారుతిశ్రీరామ్, సాత్విక్, జెస్సికాఏంజిల్, సాయినిర్వాన, పార్థివన్‌రెడ్డి, నరసింహ హేమంత్, జెస్సిరోహన్, సాకేష్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి ఎంపికయ్యారు. క్వాడ్ విభాగంలో జస్విత్‌రెడ్డి, నౌషీమ్, జతిమ్‌రెడ్డి, అజిత్, చతుర్య, ముంతాజ్, భవీష్‌రెడ్డి, సౌజిఫ్, ఉపాసన, సాదియా అలి, మహివర్షిత్‌రెడ్డి, లోక్షిత్ ప్రణవ్‌సాయి, మనస్విని, తారక్‌రామ్, సింబదర్శన్ ఎంపికయ్యారు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన చదరంగం జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అరుణకుమారి, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి అనీస్‌దర్బారి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో పీడీలు ఉమేష్, సునీల్, బాషా, వసంత్, ఆనందమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు: అండర్-17 బాలికల విభాగంలో సజోత్స్న, తేజేర్మయి, గంగాదీప్తి, చాతుర్య, జాహ్నవి, బాలుర విభాగంలో రుత్విక్‌రామ్, వరదరాజస్వామి, జతిన్‌కుమార్, కార్తికేయ, ఇమ్రాన్ ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో లాస్యశ్రీ, చిన్మయి, దివ్యాన్షి, వినయన, పూజ, బాలుర విభాగంలో వినూత్, సిద్ధార్థ, చాణక్య, అనురాగ్‌ప్రీతమ్, అభిరామన్ ఎంపికయ్యారు.

పశువైద్యంపై జాతీయ సదస్సు 23న

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక గోపవరంలోని ప్రభుత్వ పశువైద్య కళాశాలలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు పశువులు, పెంపుడు జంతువులకు సంబంధించి జాతీయ స్థాయిలో సదస్సులను నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టరు శ్రీనివాస ప్రసాదు సోమవారం తెలిపారు. ఇతర రాష్ట్రాలతోపాటు దేశ, విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొని పశువైద్యంలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలు, సత్ఫలితాలపై విశ్లేషణ ఉంటుందన్నారు. పశువులు, పెంపుడు జంతువుల ఆరోగ్యం, జబ్బుల నివారణలో వక్తలు ఆధునిక వైద్య సేవల లభ్యత, సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు.





ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతులు

మైలవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దొమ్మరనంద్యాలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జ్యోతులు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి తమ ఇళ్ల వద్ద నుంచి జ్యోతులతో పాటలు పాడుకుంటూ నాట్యం చేస్తూ అమ్మవారి అలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


దొమ్మరనంద్యాల వీధుల్లో జ్యోతుల మహోత్సవం

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ప్రయాణం... ప్రమాదం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు, పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరు వాహనదారుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారిపై ఒకే వాహనంలో రెండు వరుసల్లో లెక్కకు మించి కూలీలను తరలిస్తున్నారు. అధిక లోడుతో పాటు వేగంగా వెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇలాంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**



నిందితుడిని కఠినంగా శిక్షించాలి


పోరుమామిళ్లలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

పోరుమామిళ్ల, బద్వేలు, బద్వేలు గ్రామీణ, కొండాపురం న్యూస్‌టుడే: బద్వేలు పట్టణంలో ఇంటర్మీడియట్ విద్యార్థినిపై పెట్రోలు పోసి కాల్చి చంపిన నిందితుడు విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని మదర్‌థెరిసా ఫౌండేషన్ ఛైర్మన్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి కోరారు. పోరుమామిళ్లలో సోమవారం వివిధ సంఘాలతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి గౌసియాబేగం డిమాండు చేశారు. పోరుమామిళ్లలో సోమవారం ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ● ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ కొండాపురం మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. అనంతరం తహసీల్దారు గురప్పకు వినతిపత్రం అందజేశారు. ● విద్యార్థిని కుటుంబాన్ని సోమవారం ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ● విద్యార్థిని కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా సమన్వయకర్త సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థిని కుటుంబాన్ని సోమవారం ఆయన నాయకులతో కలిసి పరామర్శించారు. విద్యార్థిని మృతికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

ముద్దనూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో సోమవారం 25 శాతం రాయితీతో శనగలను ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవో మారెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి రైతుకు నాణ్యమైన శనగలు పంపిణీ చేయడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. తిమ్మాపురం, రాజుగురివాయిపల్లె గ్రామాల్లో 110 మంది రైతులకు 176 క్వింటాల శనగలు పంపిణీ చేశామని వివరించారు.

దారులు అధ్వానం... వసతులు శూన్యం


అద్దె గదిలో కొనసాగుతున్న కొత్తపల్లె-3 సచివాలయం


వివేకానందనగర్‌లో రహదారి దుస్థితి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లె-3 గ్రామ సచివాలయ పరిధిలో కొన్నేళ్లుగా వివిధ సమస్యలను వివేకానందనగర్ ప్రజలు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని శ్మశాన వాటికలో ఖననం చేసేందుకు పక్కా మార్గం లేక ప్రయాసలకు గురవుతున్నారు. 12 వార్డులోని పలువీధులకు ఏర్పాటు చేసిన పాత పైపులైన్‌లో ఒత్తిడి లేక అరకొరగా నీటి సరఫరా అవుతోంది. విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు, కుక్కలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటకువస్తున్న వ్యర్థాలను ఖాళీ స్థలాల నుంచి సకాలంలో తొలగించకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. వీధుల్లో సీసీ రహదారులపై ఏర్పాటు చేసిన వంతెనలపై ఎక్కువ ఎత్తులో ఉన్న కాంక్రీటు ర్యాంపుల మీదుగా వెళ్తున్న చోదకులు, పాదచారులు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. దీంతో ఆటోల డ్రైవర్లు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. వివేకానందనగర్‌లోని 12, 13 వార్డులు సంబంధించి మొత్తం 2,509 మంది జనాభా ఉండగా 638 కుటుంబాలున్నాయి.

అద్దె గదిలో సచివాలయం...

ఇక్కడున్న గ్రామ సచివాలయం 2020 నుంచి అద్దె గదిలో కొనసాగుతోంది. భవనంపైకి మెట్ల ద్వారా వెళ్లాలంటే వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. నెలకు రూ.4,700 చొప్పున బాడుగ చెల్లిస్తూ ఇరుకైన గదిలో శాఖపరమైన సమీక్ష సమావేశాల నిర్వహణకు అసౌకర్యంగా ఉంది. శాశ్వత భవనంలోకి తరలించేందుకు అవకాశాలు ఉన్నా సద్వినియోగం చేసుకోకపోవడంతో కొత్తపల్లె పంచాయతీపై ఆర్థిక భారమవుతోంది.

★ అద్దె భవనంలో ఉన్న గ్రామ సచివాలయం పక్కన అధ్వాన సీసీ రోడ్డు పలు చోట్ల కుంగిపోయింది. వర్షాలు వస్తే ఖాళీ స్థలాల్లో పాచిపట్టిన నీటి మడుగులు, పోగైన చెత్త నిల్వలతో దోమలు, దుర్వాసన, విష పురుగుల సంచారంతో ప్రజారోగ్యానికి ప్రశ్నార్థకమవుతోంది.

★ స్థానిక 13వ వార్డు నుంచి తాగునీటి గొట్టాలను 12వ వార్డులోకి అనుసంధానం చేశారు. దీంతో ముందు ఉన్న వీధుల్లోని గృహాలకు నీటి సరఫరా పోనూ 13వ వార్డులోకి పైపులకు అరకొరగా వస్తున్న నీటితో కనీస అవసరాలు తీరక అగచాట్లు పడుతున్నారు.

రుద్రభూమికి రస్తా లేదు



ప్రకాశ్‌నగర్ రోడ్డు పక్కన ఉన్న శ్మశాన వాటికలోకి వెళ్లేందుకు వీలుగా రస్తా లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. దీనిపై ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి ఫిర్యాదు చేశాం. గ్రామ సచివాలయం పక్కన పాత రోడ్డు దెబ్బతినడంతో అధ్వానంగా ఉంది. కాలువలు లేక పాచిపట్టిన మడుగులతో ప్రజారోగ్యానికి ముప్పుగా ఉంది. వ్యర్థాలను సకాలంలో తొలగించడానికి స్వచ్ఛత పనులు చేపట్టాలి.

- తాటి సుధాకర్ యాదవ్, వివేకానందనగర్

తాగునీటికి ఇబ్బందులు



స్థానిక 12వ వార్డులోని వీధుల్లో పైపులైన్ ద్వారా వచ్చే నీటి సరఫరాలో ఒత్తిడి లేదు. దీంతో మోటార్లు లేని ఇళ్లకు సక్రమంగా నీరు వస్తున్న పరిస్థితులు లేక విసిగిపోతున్నారు. శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించాలి.

- షేక్ రఫీ, వివేకానందనగర్

చర్యలు తీసుకుంటాం

వివేకానందనగర్ 12, 13 వార్డులోని వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలను చేపడుతాం. మెరుగైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాతోపాటు శ్మశాన వాటికలోకి వెళ్లేందుకు మార్గం ఏర్పాటు కోసం కృషి చేస్తాం.

- రామ్మోహన్‌రెడ్డి, కొత్తపల్లె పంచాయతీ, కార్యదర్శి

రైతు నేస్తం పురస్కారాల ప్రదానం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు మండలానికి చెందిన భానుమతి, అభిషేకంలకు రైతు నేస్తం పురస్కారాలను ప్రదానం చేశారు. కృష్ణ జిల్లా గన్నవరం స్వర్ణభారత్ ట్రస్ట్ సభా భవనంలో డాక్టరు ఐ.సుబ్బారావు శ్రీముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రైతు నేస్తం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పురస్కార గ్రహీతలైన అమృతనగర్ చెందిన బి.భానుమతి, తాళ్లమాపురం చెందిన అభిషేకంలను పురస్కారాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. యువత వ్యవసాయం చేయాలని, విద్యావంతులు సాగు వైపు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్‌వైఎస్‌ఎస్ వైస్ ఛైర్మన్ పెండకట్టి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలను అభినందిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థిని కె.హర్షిత జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టరు రామసుబ్బమ్మ సోమవారం తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లాలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ-ఏ విభాగంలోని కబడ్డీ జట్టులో పాల్గొని ప్రతిభ చాటడంతో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది నవంబరులో చెన్నైలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నీలో ఆడుతుందన్నారు. విద్యార్థినిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు బాబమ్మ, నాగూరు, రవీంద్రరెడ్డి, శైలూష, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


విద్యార్థిని హర్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ, కళాశాల ప్రతినిధులు

ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు


విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, ఉపాధ్యాయురాలు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలోని అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వి.అర్షియ (9వ తరగతి), వై.జ్ఞానికి (8వ తరగతి), జీఆర్ఎస్ నయని (10వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి ఉపాధ్యాయులతో కలిసి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొని... విజేతలుగా నిలిచి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం నెహ్రూ రోడ్డులోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. అందులో సి.నక్షత్ర (10వ తరగతి), కె.శరణ్య (9వ తరగతి), ఎస్.సన (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. పాఠశాల అధ్యక్షురాలు శ్రీయరెడ్డి, కరస్పాండెంట్ శివరామిరెడ్డిలు విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న గీతాంజలి పాఠశాల అధ్యక్షురాలు శ్రీయరెడ్డి

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

స్థానిక దొరసానిపల్లె బైపాసురోడ్డు మలుపు వద్ద గోపవరం పంచాయతీ తాగునీటి పథకానికి చెందిన గొట్టానికి ఏర్పడిన లీకేజీ ఎట్టకేలకు గుర్తించి మరమ్మతు పనులు చేపట్టారు. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 20న 'సమన్వయ లోపం.. ప్రాణాలతో చెలగాటం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఏఈ నాగభరత్‌రెడ్డి గొట్టానికి లీకేజీ గుర్తించి అరికట్టడంతో తాగునీటి వృథా ఆగింది. పాచిపట్టిన మడుగులతో పాటు ఏపుగా పెరిగిన జమ్ము, గడ్డిని తొలగించడంతో చోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ**

ముళ్లపొదల తొలగింపు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు-ముద్దనూరు ప్రధాన రహదారిలోని పెన్నా వంతెన వద్ద పలు ప్రాంతాలకు వెళ్లే ఊర్ల పేర్లు తెలిపే సూచిక బోర్డును ముళ్లపొదలు కప్పేశాయి. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'ఏ దారి ఎటు పోతుందో?' అనే శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం సూచిక చుట్టూ అల్లుకున్న ముళ్లపొదలను తొలగించారు.



సూచికకు అల్లుకున్న ముళ్లపొదలను తొలగించిన తర్వాత ఇలా...

గొర్రెల పెంపకం యూనిట్ల పరిశీలన

చాపాడు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ నూతన యూనిట్లను సోమవారం పశుసంవర్ధకశాఖ జమ్మలమడుగు ఏడీ వెంకటేశ్వరరెడ్డి పరిశీలించారు. మడూరు, రామదాసుపురం, ఎన్.అనంతపురంలో పశువైద్యాధికారి మహమ్మద్‌గౌస్‌తో కలిసి పర్యటించారు. మండలంలో నలుగురు పెంపకందార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వారు వివరించారు. ఒక్కో యూనిట్ రూ.20 లక్షలు నుంచి రూ.5 కోట్ల వరకు బ్యాంకుల నుంచి రుణం పొందేవిధంగా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.


రూ.కోటితో నిర్మిస్తున్న యూనిట్‌ను పరిశీలిస్తున్న ఏడీ వెంకటేశ్వరరెడ్డి, పశువైద్యాధికారులు

మొక్కలు నాటిన సేవాశ్రమ నిర్వాహకులు

కాశినాయన, న్యూస్‌టుడే: వరికుంట్ల ఎస్టీ కాలనీలో సోమవారం వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమన్నారు. పెళ్లి రోజు, పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రత్నాకర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో అన్నదానం

చాపాడు, న్యూస్‌టుడే: అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయంలో మైదుకూరుకు చెందిన కొండపల్లి వీరభద్రయ్య, పెరుగు కృష్ణయ్య కుటుంబీకులు అన్నదానం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనం అనంతరం ఆయన గురువైన వీరభద్రస్వామిని దర్శించుకోవడం భక్తులకు ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో మారుతిప్రసాద్, పెరుగు వీరనారాయణ, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు పోరాటం చేస్తానని, ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. బద్వేలులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

వంతెన నిర్మాణానికి రూ.45 లక్షలతో ప్రతిపాదనలు

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలం నీలాపురం నుంచి సుగాలితాండకు వెళ్లే రోడ్డులో వంతెన నిర్మాణ ప్రదేశాన్ని సోమవారం పంచాయతీరాజ్‌శాఖ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. వంతెన నిర్మాణానికి రూ.45 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఈఈ తెలిపారు. ఆయనవెంట డీఈ మధుసూదన్‌బాబు, ఏఈ సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.


వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్‌శాఖ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు

మురుగు ఇలా... అడుగేసేదెలా?

గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా మైదుకూరు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సాయినాథపురంలోని సీఎస్ఐ చర్చి వెనుక మురుగుకాలువ కోసం కల్వర్టు వేశారు. సీసీ రోడ్డు కంటే ఒకటిన్నర అడుగు ఎత్తుగా వేయడంతో కల్వర్టుకు ఇరువైపులా వాననీరు నిలుస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాసవీనగర్ నుంచి రేణుకా ఎల్లమ్మ వీధి మీదుగా వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**



ఎర్రగుంట్ల రైలునిలయంలో సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ వద్ద అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను కోరినట్లు 17వవార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి తెలిపారు. డీఆర్ఎంను ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రైల్వేస్టేషన్ ప్రభుత్వ కార్యాలయాలు ఒక వైపు, అధిక సంఖ్యలో నివాస గృహాలు మరో వైపు ఉన్నందున పుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు.


డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్ ఎరికలరెడ్డి

గండికోట నిర్వాసితులకు పట్టాలివ్వాలని డిమాండు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: గండికోట జలాశయం నిర్వాసితులైన చౌటిపల్లె గ్రామ ప్రజలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆరోపించారు. అన్యాక్రాంతమైన భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని నిర్వాసితులకు ఇవ్వాలని డిమాండు చేశారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వాసితులతో కలసి ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులకు ముద్దనూరు మండలం మంగపట్నం రెవెన్యూ పొలంలో కేటాయించిన భూములను జిల్లా అధికారులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా స్పందించి బాధితులకు కేటాయించిన భూములను అప్పజెప్పాలన్నారు. నిర్వాసితులు రామలింగారెడ్డి, యోహాన్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

జమ్మలమడుగులో రక్తదాన శిబిరం


జమ్మలమడుగు రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ రమాకాంత్, అధికారులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ రమాకాంత్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు అధికారులతో పాటు సిబ్బంది, స్థానికులు స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. పట్టణ సీఐ లింగప్ప, గ్రామీణ సీఐ గోపాల్‌రెడ్డి, కొండాపురం సీఐ రఫీ, కలమల్ల ఎస్ఐ తిమోతి, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

చెంతనే నీరు.. అందక కన్నీరు

జమ్మలమడుగు బురుజు వీధిలో తాగునీటి ఎద్దడి

– న్యూస్‌టుడే, జమ్మలమడుగు

పక్కనే పెన్నానది ప్రవాహం. నిండుగా భూగర్భ జలాలు.. అయినా పట్టణంలోని కొన్ని వీధులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఈడిగపేటలోని బురుజువీధికి నీటి సమస్య కలవరపెడుతోంది. రెండు రోజులకు ఒకసారి ఆ వీధికి నీటిని వదలినా ఇళ్లలోని ఒక్క ట్యాంకు కూడా నిండే పరిస్థితి లేదు. ఆ వీధికి కాస్త దూరంలో ఉన్న వారికి మోటారు వేస్తే వెయ్యి లీటర్ల ట్యాంకు 20 నిమిషాల్లో నిండితే బురుజు వీధిలో మాత్రం సుమారు రెండు గంటలకు పైగా పడుతుందని స్థానికులు వాపోతున్నారు.


నీటిఎద్దడి ఎదుర్కొంటున్న నగర పంచాయతీ పరిధిలోని బురుజు వీధి

పట్టించుకునేవారే లేరు

మా వీధిలో తాగునీటి సమస్య ఉందని నగర పంచాయతీ కార్యాలయ సిబ్బందికి మూడు సార్లు వినతిపత్రం అందించి విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. రోజు మార్చి రోజు వదిలినా గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి ఒంటి గంట వరకు జాగారం చేసి నీళ్లను పట్టుకోవాల్సి వస్తోంది. దీంతో పాటులో ఓల్టేజీ సమస్య వేధిస్తోంది.

- లక్ష్మీదేవి, విజయకుమారి, బురుజు వీధి, జమ్మలమడుగు



త్వరలోనే పరిష్కారం

బురుజు వీధిలో నెలకొన్న నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. అక్కడ నీటి సమస్య తలెత్తకూడదని అదనంగా రెండు గంటలు నీటిని వదులుతున్నాం. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాం.

- సురేంద్రబాబు, డీఈ, జమ్మలమడుగు నగర పంచాయతీ

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఊటుకూరు వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, పక్కన అధికారులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రీడల్లో పాల్గొని నైపుణ్యాలు చాటాలని ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి బయనపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో సోమవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి ఖోఖో అండర్-14, అండర్-17 బాలబాలికలకు జిల్లా స్థాయి జట్ల ఎంపికలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని పాపాసాహెబ్‌పేటలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. పాపాసాహబ్‌పేటలో రెండు, బాలుపల్లెలో రెండు సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, తెదేపా నాయకులు విశ్వనాథరెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

● సింహాద్రిపురంలోని బుడ్డయ్యపాళెం సమీపంలో కొత్తరోడ్డు వేసిన చోట నీరు నిలుస్తుండటంతో ఇటీవల మేమున్నాం మీకుతోడుగాలో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సీసీరోడ్డు వద్ద నీరు నిల్వలేకుండా మట్టిని వేశారు. - న్యూస్‌టుడే, సింహాద్రిపురం

● పట్టణంలోని పాత స్టేట్ బ్యాంకు నుంచి డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు వెళ్లే దారిలో చెత్త తొట్టి నిండి దుర్వాసన వస్తోందని ఇటీవల మేమున్నాం మీకుతోడుగాలో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య అధికారి బాలనరసింహులు కార్మికులను పంపించి చెత్తను తొలగించారు. - న్యూస్‌టుడే, కమలాపురం

● గ్రామ సచివాలయం వెనుక పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంతో ఇటీవల ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, సచివాలయ సిబ్బంది సోమవారం పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

?: పట్టణంలోని పడమర గండ్లూరు కాలనీ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - నాగేష్, స్థానికుడు

✔ : సిబ్బందిని పంపించి ముళ్లకంపలు తొలగిస్తాం.
- బాలనరసింహులు, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, కమలాపురం

సమస్యలు దండి... పరిష్కారం లేదండి



మాధవరం-1లో నిరుపయోగంగా చేనేత క్లస్టరు సముదాయ భవనం

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం మండలంలోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజలు పలుమార్లు వినతులు ఇచ్చినా వాటిని పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఏళ్ల తరబడిగా మౌలిక వసతుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● సిద్దవటం మండలంలోని కడపాయపల్లె, లింగంపల్లె, కొత్తపల్లె, టక్కోలు, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, సిద్దవటం, జంగాలపల్లె, మూలపల్లె, సంటిగారిపల్లె గ్రామాల్లో పెన్నానది ఒడ్డునున్న సాగు భూములు ఏటా వరదలకు కోతకు గురవుతున్నాయి. రక్షణ గోడ నిర్మించి భూములను కాపాడాలని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోంది.

● టక్కోలు పరిధిలోని ఖాజీపల్లె నుంచి కడపాయపల్లె వరకు ప్రధాన రహదారి పక్కనే కొన్నేళ్లుగా వ్యవసాయ బావులు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. బావులకు రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

● టక్కోలు బండికనుమ వద్ద ఉన్న ఆర్అండ్‌బీ రహదారిలో భారీ మలుపుతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల ఓ పాఠశాల బస్సు అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొని నిలిచిపోయింది. చోదకుడు జాగ్రత్తలు తీసుకోవడంతో బస్సు లోయలో పడకుండా ఆగిపోయింది. మలుపు వద్ద రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

● టక్కోలు, మాచుపల్లె గ్రామాల్లో ఇళ్ల మధ్య రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా ఉంది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● మాచుపల్లె-ఖాదర్‌బంగ్లా పెన్నానదిపై వంతెన నిర్మించాలని 30 ఏళ్లుగా ప్రజలు ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చినా నేటికి ఆ కల సాకారం కావడం లేదు.

● సిద్దవటంలోని దిగుపేట ప్రధాన రహదారిపై వాన నీరు నిలిచి ఉండడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో రహదారి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో తిప్పలు తప్పడంలేదు. మాధవరం-1లోని చేనేత క్లస్టరు పనిచేయక కొన్నేళ్లుగా మూతపడింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించినా చేనేతలకు ఉపయోగపడక నిరుపయోగంగా మారింది. మాధవరం-1 ప్రజలకు సిద్దవటం పెన్నానది నుంచి వచ్చే తాగునీరు సక్రమంగా సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పాడా మూత... అన్నదాతల వెత



రైతులకు అందించని రాయితీ పైపులు

పులివెందుల (వేముల), న్యూస్‌టుడే : పులివెందుల నియోజకవర్గంలోని రైతులకు రాయితీపై ప్లాస్టిక్ పైపులు అందించే అవకాశాలు కనిపించడం లేదు. పంటలకు సాగు నీరు అందించేందుకు పులివెందుల నియోజకవర్గంలోని రైతులకు 2023లో పాడా కింద రాయితీ పైపులు పంపిణీకి గత వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు పైపులు అందించాలని అధికారులు నిర్ణయించారు. రాయితీ పైపుల కోసం అన్నదాతలు తొమ్మిది నెలల కిందట సుజలా పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ నంద్యాల పేరుతో బ్యాంకుల్లో డీడీలు తీసి దరఖాస్తును అధికారులకు అందజేశారు. మొదటి, రెండు విడతల కింద డీడీలు చెల్లించిన వారికి 2024 జనవరి మొదటివారం వరకు పైపులు అందజేశారు. జనవరి చివరి వారంలో డీడీలు తీసిన వారికి మాత్రం ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 518 మంది రైతులు పైపుల కోసం ఎదురు చూస్తున్నారు. సింహాద్రిపురం మండలంలో 203 మంది, లింగాలలో 149, చక్రాయపేటలో 60, పులివెందులలో 54, వేములలో 29, వేంపల్లెలో 22 మంది రైతులు డీడీలు తీసి సచివాలయాల్లో అందించారు. పాడా నుంచి రాయితీ మొత్తం పంపకపోవడంతో పైపుల మంజూరుకు కంపెనీ అధికారులు సుముఖత చూపడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి రావడంతో పాడాను మూసివేశారు. దీంతో రాయితీ మొత్తాన్ని కంపెనీకి ఎలా చెల్లించాలో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. పైపుల గురించి బాధిత రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించగా పాడా నుంచి పైపుల కంపెనీకి రాయితీ మొత్తం చెల్లించకపోవడంతో మంజూరు చేయలేదని చెబుతున్నారు. తాము చెల్లించిన నగదును తిరిగివ్వాలని రైతులు కోరుతున్నా, అధికారులు స్పందించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్‌రెడ్డిని న్యూస్‌టుడే వివరణ కోరగా.. రాయితీకి సంబంధించిన విషయం ప్రభుత్వ పరిధిలో ఉందని ఈ నెలాఖరులోపు రైతులకు పైపులు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : తెదేపా నగరాధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి కోరారు. ఇటీవల దుండగుల దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని సోమవారం వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రతి కార్యకర్తకు ధైర్యాన్ని ఇస్తామని స్పష్టం చేశారు.



శివకొండారెడ్డిని పరామర్శిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

డీవైఎఫ్ఐ సమావేశాల విజయవంతానికి పిలుపు

కమలాపురం, న్యూస్‌టుడే : కడపలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కడప ఉక్కు, రాష్ట్ర విభజన హామీల అమలుపై చర్చ జరుగుతుందన్నారు. నాయకులు నిఖిల్, అర్జున్‌రెడ్డి, సంపత్, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

లింగాల : మండల పరిధిలోని నాలుగు పంచాయతీల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22న కామసముద్రం, 23న పార్నపల్లె, 24న కోమన్నూతల, 25న లింగాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

నేటి నుంచి భూముల రిసర్వేపై గ్రామసభలు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : గ్రామాల వారీగా భూముల రిసర్వే సమస్యలపై మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 22న దేవతాపురం ఎంపీపీ పాఠశాల, 23న తెలికి ఎంపీపీ పాఠశాల, 24న హిమకుంట్ల కమ్యూనిటీ హాల్, 25న జంగంరెడ్డిపల్లె ఎంపీపీ పాఠశాల, 26న సింహాద్రిపురం సచ్చివాలయం, 29న నిడివెలగల గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక క్వారీ ప్రారంభం

వల్లూరు, న్యూస్‌టుడే : మండల పరిధి పైడికాలువ సమీపంలోని పాపఘ్ని నది వద్ద సోమవారం ఉచిత ఇసుక క్వారీని తహసీల్దారు శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సీనరేజ్ ఛార్జీలు అంతర్జాలం, సచివాలయంలో చెల్లించి క్వారీ నుంచి ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తెదేపా మండల సమన్వయకర్త నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ

కమలాపురం : పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన థర్డ్ ఫ్లోర్ కర్లింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని దీక్షిత మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. సోమవారం పాఠశాలలో ఐదు మంది విద్యార్థినులను ప్రిన్సిపల్ తులశమ్మ, ఉప ప్రిన్సిపల్ లక్ష్మీనరసమ్మ, పీఈటీలు చంద్రకళావతి, సావిత్రి, అభినందించారు.

వాలంటీర్లను నిర్లక్ష్యం చేయడం సరికాదు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : వాలంటీర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం వాలంటీర్లతో కలిసి సీపీఐ నాయకులు మహవీర్‌కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకుని నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. ఆందోళనలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సుబ్బయ్య, రాష్ట్ర కన్వీనర్ ప్రభావతి పాల్గొన్నారు.

సృజనకు పదును



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే : చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెలోని విష్ణువిద్యాలందర్ పాఠశాలలో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రవంతి (8వ తరగతి), యశశ్విని (8వ తరగతి), అనన్య (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు ఫణిభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ప్రకాష్ విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాసులరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి మాట్లాడుతూ.. ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఫణిభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ప్రకాష్

ప్రతిభకు పరీక్ష



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీభాష్యం పాఠశాలలో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లేఖన జయశాలిని (10వ తరగతి), జాహ్నవి (10వ తరగతి), అభినవ్ శ్రీరామ్ (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ నాగసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథ్, శ్రీధర్ విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ నాగసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు

బడుగుల సంక్షేమ పథకాలు పునరుద్ధించాలి

జిల్లా సచివాలయం : చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బడుగుల సంక్షేమ పథకాలను పునరుద్ధించాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు జేవీ రమణ, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు సంగటి మనోహర్, జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి డిమాండు చేశారు. సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట చేతివృత్తుల కులాల ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ వినతిపత్రం అందించారు. నాయకులు పీవీరమణ, గంగులు, శైవ రామాంజనేయులు, జయరాములు, మల్లయ్య, రామచంద్ర, ఎస్వీ రమణ, కొండయ్య, నరసింహులు, శంకరయ్య, పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని డిమాండు

జిల్లా సచివాలయం, సిద్దవటం : ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని సిద్దవటం మండలం ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని సాయినగర్ మహిళలు డిమాండు చేశారు. సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట మహిళలు నిరసన వ్యక్తం చేసి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. బడి, గుడి, తదితర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే సిద్దవటం పోలీసు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వాయుసేనలో ఉద్యోగాలు సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వాయుసేన, ఎన్‌వైకే, స్టెప్, కళాశాల ప్రతినిధులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వాయుసేనలో ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్‌ఫోర్సు అధికారులు సువేందర్ సింగ్, సందీప్ పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్, ఎన్‌వైకే, స్టెప్ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎయిర్‌ఫోర్సు ఉద్యోగావకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురుషులకే కాకుండా మహిళలకు కూడా ఎయిర్‌ఫోర్స్‌లో విస్తృతంగా ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం అధికారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ వి.సలీంబాషా, ఎన్‌వైకే అధికారి మణికంఠ, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, విజయలక్ష్మి, గురుమోహన్‌రెడ్డి, విద్యార్థులు హాజరయ్యారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చేయూతనందిస్తోందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు సోమవారం తన స్వగృహంలో రూ.10 లక్షల చెక్కులు అందజేశారు. అర్హులైన వారికి సీఎం సహాయ నిధి మంజూరుకు కృషి చేస్తామన్నారు.

ఆవేశం లేని ఆధునిక వాది విద్వాన్ విశ్వం

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఆదర్శ రచయితగా, కవిగా, పండితుడిగా, మానవతావాదిగా సుప్రసిద్ధులైన విద్వాన్ విశ్వం ఆవేశం లేని ఆధునికవాదిగా నిలిచారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విశ్వం జయంతి సందర్భంగా నగరంలోని కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. విరికన్య (కావ్యం), ఆత్మసాక్షి (కవిత్వం), ప్రేమించెను (నవల)తో పాటు అనేక కావ్యాలు, వచన రచనలు మరెన్నో అనువాదాలు చేశారన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ సభ్యుడు తవ్వా వెంకటయ్య, వెంకటేశ్వరాచారి, బాలయల్లారెడ్డి, పాల్గొన్నారు.

కాశీలో సామూహిక పిండ ప్రదానం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడపకు చెందిన శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం కాశీలోని గంగానది ఒడ్డున 375 మందికి సామూహిక పిండ ప్రదానం చేశారు. సేవా సమితి సభ్యుడు రవి మాట్లాడుతూ.. శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 375 మంది అనాథలకు అంత్యక్రియలు నిర్వహించామన్నారు. సభ్యులు రెడ్డిలక్ష్మణ్, పురుషోత్తం, సురేష్‌బాబు, వెంకటసురేష్‌బాబు, దామోదర్, టైలర్ రవి, దినేష్, రాజశేఖర్‌రెడ్డి, మధు తదితరులున్నారు.

కడప డిప్యూటీ కమిషనర్‌గా రాంబాబు

బిల్టప్, న్యూస్‌టుడే : కడప డిప్యూటీ కమిషనర్‌గా రాంబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వహించేవారు. అక్కడి నుంచి కడపకు బదిలీ చేశారు.

తపాలా జీవిత బీమాపై అవగాహన

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ)పై కడప రైల్వేపోస్టు మెయిల్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎల్ఐ డెవలప్‌మెంట్ అధికారి మునాఫ్ మాట్లాడుతూ... పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఆవశ్యకతను వివరించారు. రైల్వే పోస్టల్ సూపరింటెండెంట్ హరికృష్ణ ప్రసాద్, కడప సబ్ రికార్డు అధికారి ఓబయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : ఎన్డీయే ప్రభుత్వం మహిళలను మోసంచేసిందని పీసీసీ మీడియా అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారికిచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. గతంలో కాంగ్రెసు ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

జవాను కుటుంబాన్ని ఆదుకోవాలని లేఖ

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : నక్సల్స్ బాంబు దాడిలో అసువులు బాసిన జవాన్ రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆయన సతీమణికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ముగ్గురు చిన్న పిల్లలు ఉండడంతో మానవతా దృక్పథంతో స్పందించాలని లేఖలో పేర్కొన్నారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక

కడప (క్రీడలు), న్యూస్‌టుడే : సౌత్‌జోన్ హాకీ పోటీలకు కడప నగరం శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థి ఎంవీ.రాఘవేంద్ర ఎంపికై సత్తాచాటాడు. జేఎన్‌టీయూ హాకీ బృందం తరఫున సౌత్‌జోన పోటీల్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వీరసుదర్శన్‌రెడ్డి, కళాశాల వైస్ ఛైర్మన్ ప్రకాష్, ప్రదీప్, కళాశాల పీడీ క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సిద్దవటం, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని బెటాలియన్ బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట శివారులోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప, అసిస్టెంటు కమాండెంటు థియోఫిలాస్, సిద్దవటం అటవీక్షేత్రాధికారిణి కళావతి, బెటాలియన్ వైద్యాధికారిణి దివ్యరాణి, ఆర్ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. **వేంపల్లె :** పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వేంపల్లె ఎస్సై తిరుపాల్‌నాయక్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా స్వామ్య, సమాజ పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. సీఐ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



బెటాలియన్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప



వేంపల్లెలో నివాళులర్పిస్తున్న ఎస్సై తిరుపాల్‌నాయక్

ఒంటిమిట్ట : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్ సోమవారం పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో శాంతి భద్రతల పరిరక్షణకు ముందుకు సాగుతున్నామన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

వసతుల లేమి... పట్టించుకోరేమి?



విజయదుర్గా కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన వాననీరు



అంతర్గత రోడ్ల దుస్థితి

కడప ఏడు రోడ్లు, న్యూస్‌టుడే : నగర పరిధిలోని విజయదుర్గా కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అందులో 4 అపార్టుమెంట్లు ఉన్నాయి. సంపన్నులు, అధికారులు, మధ్య తరగతి వారు ఎక్కువగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. కాలనీలో మౌలిక వసతులు బాగుంటాయని... సమస్యలు ఉండవని అనుకుంటే పొరపాటే. ప్రధానరోడ్లు బాగున్నప్పటికీ అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు. ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో దోమలకు, పాములకు ఆ ప్రాంతం ఆవాస కేంద్రంగా మారింది. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాన నీరు ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో చోరీలు అధికమయ్యాయి. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.